
సాక్షి
రంగారెడ్డి
గురువారం । 13 । ఏప్రిల్ । 2023

రేపటి నుంచి వైద్య సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్ హెచ్ఐసీసీలోని నోవాటెల్ హోటల్‌లో 'గుర్తింపు పొందిన ఆరోగ్య సంరక్షణ సంస్థల (సీఏహెచ్ఓసీఓఎన్‌- కహో కాన్) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు 7వ అంతర్జాతీయ సదస్సు కన్సార్టియం నిర్వహించనున్నారు. వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభిస్తారు. 16వ తేదీన ముగింపు ఉత్సవానికి గవర్నర్ తమిళిసై ముఖ్యఅతిథిగా హాజరవుతారు.



చుక్కాపూర్‌లో రైతువేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తదితరులు



న్యూస్‌రీల్

బాలికపై సర్పంచ్ భర్త లైంగిక దాడి

కడ్తాల్: సర్పంచ్ భర్త ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని గానుగుమార్లతండాలో బుధవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని ఓ తండాకు చెందిన దంపతులు తమ పన్నెండేళ్ల కూతురుతో కలిసి పది రోజుల క్రితం గానుగుమార్లతండాకు వచ్చారు. గ్రామ సర్పంచ్ హంష భర్త మోత్యానాయక్ వ్యవసాయ పొలం వద్ద పనికి కుదిరారు. వ్యవసాయ పనులు చేస్తూ పొలం వద్దే జీవనం సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా తాము వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో.. ఒంటరిగా ఉన్న బాలికపై మోత్యానాయక్ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని తల్లిదండ్రులు బుధవారం కడ్తాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలికను వైద్య పరీక్షల నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మైసమ్మ సేవలో ఇంటెలిజెన్స్ చీఫ్



అమ్మవారి సన్నిధిలో ప్రభాకర్‌రావు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి ఆలయంలో అమ్మవారిని బుధవారం తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. శాలువా, పూలమాలలతో సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట కందుకూరు సీఐ కృష్ణంరాజు, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయండి



చేవెళ్లలో ఎంపీడీఓ కార్యాలయ భవన్నాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

చేవెళ్ల: మండల కేంద్రంలో కొనసాగుతున్న నూతన ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణ పనులపై జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి అసహనం వ్యక్తంచేశారు. బుధవారం చేవెళ్లకు వచ్చిన ఆమె భవనాన్ని పరిశీలించారు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కావడం లేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చైర్‌పర్సన్‌కు తెలిపారు. దీనిపై స్పందించిన ఆమె పంచాయతీరాజ్ జిల్లా అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. కాంట్రాక్టర్ అలసత్వం కారణంగానే జాప్యం జరుగుతోందని చెప్పడంతో త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఉంటే వెంటనే టెండర్ రద్దు చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ రాజ్‌కుమార్, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పనులు 'లెస్సే'నా?

'ఎంత తక్కువైనా పరవాలేదు.. వర్క్ మనకే దక్కాలి' అనేలా వ్యవహరిస్తున్నారు కొంత మంది కాంట్రాక్టర్లు. ఆదాయం ఎక్కువగా ఉన్న మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు పోటీపడుతున్నారు. యాభై శాతం లెస్‌తో టెండర్లు వేస్తూ ఆశ్చర్యపరుస్తున్నారు. ఇలా చేజిక్కించుకుంటున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఎంత మేర పాటిస్తున్నారో..? అధికారులకే తెలియాలి.

అభివృద్ధి పనులకు కొత్త తరహా టెం'డర్'

- శివారు మున్సిపాలిటీల్లో కాంట్రాక్టర్ల పోటీ
- యాభై శాతం లెస్‌తో పనులు దక్కించుకుంటున్న వైనం
- తలకిందలవుతున్న ఇంజినీర్ల ఎస్టిమేషన్లు
- పూర్తయిన కొద్ది రోజులకే ధ్వంసమవుతున్న డ్రైనేజీలు, రోడ్లు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఇంజనీర్ల అంచనాలను పలువురు కాంట్రాక్టర్లు తలకిందులు చేస్తున్నారు. ఎలాగైనా పనులు దక్కించుకోవాలనే ఆశతో కొంత మంది కాంట్రాక్టర్లు ఆయా అభివృద్ధి పనులకు 45శాతం లెస్‌తో టెండర్లు దాఖలు చేస్తున్నారు. లెస్‌లో టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాణ్యతను గాలికొదిలేస్తున్నారు. ఇంజనీర్ల పర్యవేక్షణ లోపం కారణంగా కాంట్రాక్టర్లు చేసిన డ్రైనేజీ లైన్లు, సీసీ రోడ్లు ఆ తర్వాతి కొద్ది రోజులకే ధ్వంసమవుతుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకే డిమాండ్

వార్షిక సంవత్సరం ముగియడం, సాధారణ ఎన్నికల గడువు కూడా సమీపిస్తుండటతో స్థానిక సంస్థల పరిధిలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. వీటిలో ప్రధానంగా సీసీ రోడ్లు, అంతర్గత భూగర్భ డ్రైనేజీలు, సమీకృత మార్కెట్ సముదాయాలు, ప్రభుత్వ పాఠశాల ప్రహరీలు, కొత్త తరగతి గదులు నిర్మాణం వంటివి ఉన్నాయి. ఇంజనీర్లు వీటికి అంచనాలు రూపొందించి ఔత్సాహిక కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. సాధారణంగా మ్యాన్‌పవర్, యంత్రాలు, మెటీరియల్ ఉన్న కాంట్రాక్టర్లు ఆయా పనులకు ఐదు నుంచి పదిశాతం లెస్‌తో టెండర్లు వేస్తుండటం సాధారణమే. కానీ ఇందుకు భిన్నంగా తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఓ కాంట్రాక్టర్ ఏకంగా 45 శాతం లెస్‌తో డ్రైనేజీ పనులకు, 30శాతం లెస్‌తో సీసీ రోడ్లకు టెండర్లు వేయడం చర్చనీయాంశంగా మారింది. అంతేకాదు, జీహెచ్ఎంసీ పరిధిలో ఆయా పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు.. శివారు మున్సిపాలిటీల్లో యాభైశాతం లెస్‌తో టెండర్లు వేస్తుండటం వెనక ఉన్న ఆంతర్యం ఏమిటో అంతుచిక్కడం లేదు.

ఆరు మున్సిపాలిటీల్లోనే పోటీ

15వ ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతి, జనరల్ ఫండ్స్‌తో అభివృద్ధి పనులు చేపడుతుంటారు. మణికొండ, నార్సింగి, శంషాబాద్, బడంగ్‌పేట్, పెద్ద అంబర్‌పేట్, తుర్కయాంజాల్ మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను ఎక్కువగా వసూలవుతుంది. ఆయా మున్సిపాలిటీల ఖజానాలో నిధులు పుష్కలంగా ఉంటుండటంతో ఇక్కడ పనులు చేజిక్కించుకునేందుకు కాంట్రాక్టర్లు పోటీపడుతున్నారు. ఇక ఆదాయం పెద్దగా లేని ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, కొత్తూరు, శంకర్‌పల్లి, షాద్‌నగర్, మీర్‌పేట్, తుక్కుగూడ, జల్‌పల్లి వంటి మున్సిపాలిటీల్లో పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. సమీకృత మార్కెట్ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పార్కుల చుట్టూ ప్రహరీలు తదితర పనులు చేసేందుకు వెనకాడుతున్నారు. రోజుల తరబడి పని చేయాల్సి రావడం, బిల్లులు సకాలంలో అందకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

కమీషన్లకు ఆశపడి..

ప్రభుత్వ భవనాలు, ప్రహరీల నిర్మాణం, రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు వంటి సివిల్ వర్క్స్‌కు సంబంధిత శాఖల ఇంజనీర్లతో ఎస్టిమేషన్లు వేయిస్తారు. ఇంజనీర్లు కూడా భవిష్యత్తులో పెరగబోయే మెటీరియల్ ధరలను దృష్టిలో ఉంచుకుని అంచనాలు రూపొందిస్తుంటారు. వాస్తవ పనికయ్యే ఖర్చుకు అదనంగా కలిపి అంచనాలు తయారు చేస్తారు. ఈ సమయంలో కొంతమంది కాంట్రాక్టర్లు ఇచ్చే ముందస్తు కమీషన్లకు ఆశపడి అంచనాలకు మించి వర్క్ ఎస్టిమేషన్లు వేస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్లు ఎక్కువ లెస్‌తో టెండర్లు దాఖలు చేస్తున్నారు. కాంట్రాక్టర్లు చేపట్టిన పనులకు జిల్లా ట్రెజరీ నుంచి బిల్లులు క్లియర్ చేయాల్సి ఉంటుంది. కానీ కొంతమంది కమీషన్ల కోసం జనరల్ ఫండ్ నుంచి క్యాష్ పేమెంట్ చెక్కులు జారీ చేస్తుండటం గమనార్హం. లెస్‌లో టెండర్లు దక్కించుకుని పనులు చేపడుతుండటం, నాసిరకం మెటీరియల్ వాడటం, నాణ్యతాప్రమాణాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు చేసిన పనులు ఏడాది తిరగక ముందే మరమ్మతులకు చేరుకుంటున్నాయి.

గిట్టుబాటు ఎలా?

యంత్రాలు, మెటీరియల్ ఉన్న కాంట్రాక్టర్లు సహజంగానే ఐదు నుంచి పదిశాతం లెస్‌తో టెండర్లు దాఖలు చేస్తుంటారు. మొత్తం బిల్లులో క్షేత్రస్థాయిలోని ప్రజాప్రతినిధులకు పదిశాతం, ఏఈ, డీఈ, కమిషనర్, ఇతర అధికారులకు ఏడు శాతం చొప్పున ముడుపులు ముట్టడం బహిరంగ రహస్యమే. ఆతర్వాత బిల్లుల క్లియరెన్స్ కోసం ట్రెజరీలోనూ మూడు శాతం సమర్పించుకోవాల్సిందే. కానీ ఏకంగా 30- 45 శాతం లెస్‌తో పనులు దక్కించుకుంటున్న కాంట్రాక్టర్లు నాణ్యతను ఎలా పాటిస్తారు..? వీరికి గిట్టుబాటు ఎలా అవుతోంది..? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

మళ్లీ మనదే అధికారం

- కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేద్దాం
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- చుక్కాపూర్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

తలకొండపల్లి: రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు గాను 103 చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో మరోసారి అధికారం చేజిక్కించుకోవడంతో పాటు కేసీఆర్‌ను ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిని చేస్తామన్నారు. మండల పరిధిలోని చుక్కాపూర్‌లో చేపట్టిన రైతు వేదిక, సీసీ రోడ్ల పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం ముందు వరుసలో ఉందన్నారు. దీంతో దేశం చూపంతా తెలంగాణ వైపే ఉందని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, స్థలం ఉన్న అర్హులైన నిరుపేదలందరికీ గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలు మంజూరు చేస్తామని స్పష్టంచేశారు. మొదటి విడతలో గొర్రెలు అందని గొల్లకురుమలకు రెండో విడతలో పథకాన్ని వర్తింపజేస్తామని తెలిపారు. అర్హులైన వారికి 'దళితబంధు' ద్వారా చేయూతనిస్తామన్నారు. రైతు రుణమాఫీకి సీఎం కేసీఆర్ నిధులు కేటాయించారని, మాఫీ వర్తింపజేసి కర్షకులను ఆదుకుంటామని వెల్లడించారు. తెలంగాణ రాకముందు, వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధిని పరిశీలించాలని ప్రజలకు సూచించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. తమ నాయకుడు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుంటే.. ప్రధాని మోదీ మాత్రం కార్పొరేట్ శక్తులు, బడా నాయకులకు దేశ సంపదను దోచి పెడుతున్నారని మండిపడ్డారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నారాయణ్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోళి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీ కో ఆప్షన్ ముజీబర్ రహ్మాన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మా సత్యం, దశరథ్‌నాయక్, సర్పంచ్‌లు స్వప్నాభాస్కర్ రెడ్డి, అలివేలు, జీరానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశుగుప్తా, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హుల పేర్లను లిస్ట్‌లో చేరుస్తాం



ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

- కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఓటరు జాబితా నుంచి తొలగించిన వారి వివరాలను మరోసారి పరిశీలించి, ధ్రువీకరిస్తామని కలెక్టర్ హరీశ్ స్పష్టంచేశారు. ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో కలిసి మాట్లాడారు. అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా లిస్ట్ నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. వివిధ కారణాల వల్ల ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్లను పోలింగ్ స్టేషన్ల వారీగా పరిశీలించి, అర్హుల వివరాలను తిరిగి నమోదు చేస్తామని వివరించారు. ఈ సమావేశంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ చంద్రకళ, కందుకూరు ఆర్డీఓ సూరజ్, షాద్‌నగర్ ఆర్డీఓ రాజేశ్వరి, చేవెళ్ల ఆర్డీఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం.. హత్య!

- ప్లాస్టిక్ సంచిలో కుక్కిన మహిళ మృతదేహం లభ్యం
- తుక్కుగూడలో కలకలం
- వివరాలు వెల్లడించిన పోలీసులు



మృతురాలి ఉంగరాలు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ప్లాస్టిక్ సంచిలో కుక్కిన ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. అత్యాచారం చేసి.. ఆపై హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ కథనం ప్రకారం.. పహాడీషరీఫ్ నుంచి తుక్కుగూడకు వెళ్లే దారిలో సర్దార్‌నగర్ గేట్ సమీపంలోని జేటీ హోల్డింగ్ కంపెనీ పక్కన ప్లాస్టిక్ సంచి నుంచి దుర్వాసన రావడాన్ని గమనించిన వాచ్‌మన్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మహేశ్వరం డీసీపీ సీహెచ్.శ్రీనివాస్, ఏసీపీ అంజయ్య, ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సంచిని విప్పి చూడగా.. అందులో కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలి వయసు 30- 35 ఏళ్లు ఉంటుంది. క్లూస్ టీం ఆధారాలు సేకరించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఏసీపీ అంజయ్య, ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్

మూడురోజుల క్రితమే హత్య?

మహిళ మృతదేహం కుళ్లిన స్థితిని బట్టి మూడు రోజుల క్రితమే హత్య జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మెడకు టవల్ బిగించి చంపి ఉంటారని చెప్పారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాకే పూర్తి స్పష్టత వస్తుందని వివరించారు.

మృతురాలి ఒంటిపై ఉన్న వస్తువులివే..

మృతురాలి మెడలో పసుపురంగు తాడు, కుడి చేతికి రెండు ఎరుపు గాజులు, చేతివేళ్లకు రెండు ఉంగరాలు, పసుపు కలర్ జాకెట్, చాక్లెట్ కలర్ లంగా, ఎరుపు రంగు చీర, నలుపు, ఎరుపు రంగు చెప్పులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆనవాళ్లు కలిగిన ఎవరి సంబంధీకులైనా అదృశ్యమైతే పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ (ఫోన్ నంబర్: 94906 17241)లో సంప్రదించాలని సూచించారు.

క్రీడా రంగానికి పెద్దపీట

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

శామీర్‌పేట్: రాష్ట్రంలోని అన్ని రంగాలను అభివృద్ధిపరిచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలో రూ.13 కోట్లతో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ హాల్, వెయిట్ లిఫ్టింగ్, రోయింగ్, ఫిజియోథెరపి, స్ట్రెంత్ అండ్ కండిషన్ హాల్స్‌ను, నాలుగున్నర కిలోమీటర్ల క్రాస్ ట్రాక్‌లను మంత్రి మల్లారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, యువత కోసం క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలోనూ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసుకున్నామని భవిష్యత్తులో మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. త్వరలో క్రీడా పాలసీసీ తీసుకువస్తామన్నారు. రాష్ట్రంలో క్రీడా విధానాలు బాగుడటం వల్లే నిఖత్ జరీన్ అంతర్జాతీయ క్రీడాకారిణిగా గుర్తింపు సాధించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణీదేవి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ ఆంజనేయ గౌడ్, క్రీడా పాఠశాల ఓఎస్‌డీ హరికృష్ణ, అధికారులు సుజాత, మనోహర్ తదిరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తెలంగాణ అభివృద్ధి



షాబాద్ నుంచి నరెడ్లగూడ వరకు బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు



స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి సబితారెడ్డి తదితరులు

- పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి కల్పిస్తాం
- 'పాలమూరు'ను పూర్తి చేసి సాగు నీరందిస్తాం
- మంత్రి సబితారెడ్డి వెల్లడి
- మోదీ సర్కారుపై విమర్శనాస్త్రాలు

షాబాద్: తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో జరిగిన తెలంగాణ సమగ్రాభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలిచిందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండలంలో రూ.1.2 కోట్లతో చేపట్టిన బీటీ పనులకు ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతితో కలిసి బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచిన మోదీ సర్కార్.. పేదల నడ్డి విరుస్తోందని ఆరోపించారు. సీతారాంపూర్‌లో ఎలక్ట్రిక్ వాహనాల తయారీతో పాటు మరో భారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీటిలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని స్పష్టంచేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ జిల్లా చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్ వెంకటేశ్, ఎంపీటీసీ అరుణ, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్, బీఆర్ఎస్ నాయకులు వెంకటయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు..

అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే సమాజంలో అందరికీ గౌరవం దక్కుతోందని మంత్రి సబితారెడ్డి అన్నారు. సీతారాంపూర్‌లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఏ ఒక్క వర్గానికి చెందినవారు కారని, ఆయన అందరివారని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాలకు ఆదర్శంగా నిలుస్తోందని స్పష్టంచేశారు. ఆ మహనీయుడి కృషితోనే మహిళలకు రిజర్వేషన్లు దక్కాయన్నారు. అన్ని కులాలకు సమాన హక్కులు రాజ్యాంగం ద్వారానే సిద్ధిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాండురంగారెడ్డి, ఎంపీటీసీ సందీప్, ఉప సర్పంచ్ సందీప్, నాయకులు నాగరాజు, వాసుదేవరెడ్డి, డాక్టర్ రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

శంకర్‌పల్లి: మహనీయుల జీవిత చరిత్రలను ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. కొత్తపల్లి గ్రామంలో నిర్మించిన బస్టాండ్ యార్డు, అంగన్‌వాడీ భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన స్వామివివేకానంద, మహాత్మా జ్యోతిరావు పూలే, మహాత్మా గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం గ్రామాల్లో పెద్ద ఎత్తున మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శాంతిచెన్నయ్య, ఎంపీటీసీ శోభసుధాకర్‌రెడ్డి, ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవిందర్‌గౌడ్, ఏఎంసీ చైర్మెన్ పాపారావు, నాయకులు విష్ణువర్ధన్, బొల్లారం వెంకట్‌రెడ్డి, శ్రీనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఐటీ నజర్

స్థిరాస్తి రిజిస్ట్రేషన్లపై ఆదాయ పన్ను శాఖ ఆరా

- రూ.30 లక్షలకు పైగా విలువైన దస్తావేజులపై దృష్టి
- సబ్‌రిజిస్ట్రార్ల వారీగా డాక్యుమెంట్ వివరాల సేకరణ

సాక్షి, సిటీబ్యూరో: స్థిరాస్తుల కొనుగోలుదారులకు ఆదాయ పన్ను గుబులు పట్టుకుంది. తాజాగా ఐటీ శాఖ ఆదేశాలతో నగర శివార్లలోని విల్లాలు, ఫ్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో రూ.30 లక్షలపైగా విలువగల దస్తావేజులపై ఐటీ శాఖ ఆరా తీస్తోంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా దస్తావేజుల వివరాల కోసం రిజిస్ట్రేషన్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. స్థిరాస్తి రిజిస్ట్రేషన్లన్నీ పాన్ కార్డుతో ముడిపడి ఉంటాయి. విలువైన స్థిరాస్తి కొనుగోళ్లన్నీ రిజిస్ట్రేషన్ల శాఖ ఐటీ శాఖకు నివేదిస్తోంది. లావాదేవీల విలువ రూ.10 లక్షలకు మించితే పాన్ కార్డు వివరాలు నమోదు చేస్తుంది. స్థిరాస్తుల అమ్మకం, కొనుగోలుకు సంబంధించి ఫారమ్ 26ఏలో నమోదు తప్పనిసరి. నిబంధనలు పాటించని కొనుగోలుదారులకు మాత్రం చిక్కులు తప్పనిసరి పరిస్థితిగా కనిపిస్తోంది. స్థిరాస్తుల కొనుగోలుకు అంత సొమ్ము ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలంటూ తమకు నోటీసులు వస్తాయోనని కొందరు ఆందోళనకు గురవుతున్నారు.

కరోనా అనంతరం పెరిగిన కొనుగోళ్లు..

కరోనా తర్వాత నగర శివార్లలో స్థిరాస్తి కొనుగోళ్లు భారీగా పెరిగాయి. గ్రేటర్ మొత్తం మీద గత ఆర్థిక సంవత్సరం 4.72 లక్షల స్థిరాస్తి లావాదేవీలు జరిగితే.. కేవలం శివారు ప్రాంతాల్లోనే 4.09 లక్షల దస్తావేజులు నమోదు కావడం విశేషం. సాధారణంగా రాష్ట్రంలోనే అత్యధికంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాల పరిధిలో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. భూమి విలువ కూడా రికార్డు స్థాయిలో ఉంటుంది. ప్రభుత్వ విలువ కూడా తక్కువేం ఉండదు. దీంతో విల్లాలు, ఫ్లాట్ల దస్తావేజుల విలువ సుమారు అర కోటికి మించేస్తుంటాయి.

ఐటీకి చిక్కకుండా..

సాధారణంగా నగర శివార్లలో రిజిస్ట్రేషన్ విలువ కంటే బహిరంగ మార్కెట్ విలువ మూడింతలు అధికంగా ఉంటుంది. బిల్డర్లు సైతం రిజిస్ట్రేషన్ విలువ మినహా మిగతా డబ్బులు నగదు రూపంలో తీసుకునేందుకు ఆసక్తి కనబర్చుతుంటారు. దీంతో రిజిస్ట్రేషన్ విలువకు, అమ్మే రేట్లకు అంతులేని వ్యత్యాసం ఉంటుంది. కనీసం 20 శాతం కూడా స్టాంప్ డ్యూటీ చెల్లించరు. మిగిలినదంతా నగదుగా మారుస్తారనే అభియోగాలున్నాయి. స్టాంప్ డ్యూటీ ఎగ్గొట్టి, ఇటు నగదు లావాదేవీల లెక్కలు ఐటీకి దొరక్కుండా నిర్మాణ సంస్థలు చేతివాటం ప్రదర్శించడం షరామామూలే.

మేధావుల్లో అగ్రగణ్యుడు అంబేడ్కర్



రాంపూర్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్సీ తదితరులు

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి

తలకొండపల్లి: ప్రపంచ మేధావుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అగ్రగణ్యుడని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. బుధవారం మండల పరిధిలోని రాంపూర్‌లో యువత ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి చిత్తరంజన్‌దాసు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్, ఎంపీపీ తిర్మణీ నిర్మలాశ్రీశైలంగౌడ్, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాలను పఠించి ఉన్నతంగా రాజ్యాంగాన్ని రచించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, ఉప సర్పంచ్ మోహన్‌రెడ్డి, కృష్ణ మహేశ్, జ్యోతయ్య, డేవిడ్ సుధాకర్, దర్వుల శంకర్, బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కార్యదర్శి జోగు రమేశ్, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిరఘురాం, రఘురాములు, మాజీ సర్పంచ్ శ్రీనివాసాచారి, సింగిల్ విండో డైరెక్టర్ నయీం, హరిమోహన్‌రెడ్డి, అజీజ్, రేణురెడ్డి, యాదయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బఫర్ నిర్మాణాలు కూల్చివేత



మణికొండ: చెరువు బఫర్ జోన్‌లో దశాబ్దం క్రితం కట్టి వదిలేసిన విల్లాలను బుధవారం హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా కూల్చివేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ సర్వే నంబర్ 40లో 108 ఎకరాలలో చెరువు ఉంది. దాని పక్కనే గతంలో భూమి కొనుగోలు చేసి కొందరు విల్లాలు నిర్మించుకున్నారు. దశాబ్దం నుంచి పనులు ఇప్పటి వరకు కొనసాగుతున్నాయి. పట్టాభూమి పక్కనే ఉన్న చెరువు బఫర్ జోన్ భూమిని కలిపి ఓ వరుసలో 12 విల్లాలు నిర్మించాలని పనులను మొదలు పెట్టారు. అప్పట్లోనే గ్రామపంచాయతీ, తరువాత రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు వాటిల్లో కొన్ని విల్లాలను కూల్చివేశారు. ఇక నెక్నాంపూర్ పెద్ద చెరువు పక్కనే గతంలో కట్టి వదిలేసిన ఆరు విల్లాలను బుధవారం కూలివేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీవాహకం అంతా కబ్జాలే...

నెక్నాంపూర్ పెద్ద చెరువు రికార్డుల ప్రకారం 108 ఎకరాలు ఉండగా ప్రస్తుతం 86 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు ఇటీవల జరిగిన సర్వేలో అధికారులు తేల్చారు. మిగతా భూమి చెరువు చుట్టూ కబ్జాలకు పాల్పడ్డారని, వాటన్నింటినీ తొలగించి పూర్తి స్థాయిలో చెరువును పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని నెక్నాంపూర్ వాసులు కోరుతున్నారు. ఇదే చెరువు పక్కనే ఇటీవల హెచ్‌ఎండీఏ అనుమతులతోనే ఓ అపార్ట్‌మెంట్ నిర్మాణం సైతం బఫర్ జోన్‌లోనే జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ నెక్నాంపూర్ పెద్ద చెరువు పరీవాహకంలో బఫర్ జోన్‌లో వచ్చిన నిర్మాణాలను కూల్చివేయటంతో పాటు కొత్తగా వచ్చే నిర్మాణాలను అడ్డుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

చేవెళ్ల: డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైంది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. షాబాద్ మండల కేంద్రానికి చెందిన ఎండీ అంజద్‌కు ఫాతిమా (21), సలీమా కుమార్తెలు సంతానం. వీరిద్దరూ చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నారు. ఎప్పటిలాగే మంగళవారం అక్కాచెల్లెలు కళాశాలకని వచ్చారు. సాయంత్రం కళాశాల నుంచి చేవెళ్ల బస్‌స్టేషన్‌కు వచ్చి షాబాద్ బస్సు రాగానే చెల్లెలు సలీమా బస్సు ఎక్కింది. ఫాతిమా వాటర్ బాటిల్ తీసుకొస్తానని చెప్పివెళ్లి తిరిగి రాలేదు. ఎంతకూ అక్క జాడ తెలియకపోవడంతో సలీమా తల్లిదండ్రులకు సమాచారం అందించింది. రాత్రి వరకు తమ కూతురు ఇంటికి చేరుకోకపోవటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. బుధవారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హయూమ్ తెలిపారు.

వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ ఢీ.. కూలీ మృతి

ఇబ్రహీంపట్నం: వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ ఢీకొని కూలీ మృతి చెందాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. మంచాల మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన వి.భిక్షపతి(55) చర్లపటేల్‌గూడకు వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణ పనులకు కూలి పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ ఢీకొట్టడంతో భిక్షపతి మృతి చెందినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

రాజేంద్రనగర్: ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న కేసులో ఉస్మానియాలో చికిత్సపొందుతున్న మహిళ బుధవారం మృతి చెందింది. రాజేంద్రనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నంది ముస్లాయిగూడకు చెందిన శివాణి మంగళవారం ఉదయం పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే వద్ద గల రహదారి పక్కన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. ఈ ఘటనలో గాయపడ్డ శివానిని రాజేంద్రనగర్ పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఐదుగురు టీచర్లకు తప్పిన ప్రమాదం

ఆటోను తప్పించబోయి కారు బోల్తా

కందుకూరు: ఎదురుగా వచ్చిన ఆటోను తప్పించబోయి కారు బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు మనోహర్‌రెడ్డి, మరుధ్వతి, భాను, భారతి, విద్యావతి కడ్తాల్ మండలం ముద్విన్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. నిత్యం హైదరాబాద్ నుంచి కారులో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యలో కందుకూరు మండలం నేదునూరు గేటు సమీపంలో ఎదురుగా దూసుకొచ్చిన ఆటోను తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. అయితే ఎవరికి గాయాలు కాకుండా తప్పించుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



ప్రమాదంలో బోల్తా పడిన కారు

స్కూల్ బస్సు అదుపు తప్పి..

- 16 మంది విద్యార్థులకు స్వల్పగాయాలు
- ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలు

మణికొండ: ఓ స్కూల్ బస్సు అదుపు తప్పి ఓ ద్విచక్రవాహనదారుడిని ఢీకొని డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలు కాగా, బస్సులో ఉన్న 16 మంది విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. నార్సింగి పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శంకర్‌పల్లి మండలం, కొండకల్ గ్రామ పరిధిలోని ఇండూస్ ఇంటర్నేషనల్ స్కూల్ బస్సు బుధవారం హైదరాబాద్ వైపు వస్తుంది. కోకాపేట సర్కిల్‌లో అదుపు తప్పి బైక్‌పై వెళుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అజయ్‌కుమార్‌ను ఢీకొట్టి రోడ్డు మధ్యలో ఉండే డివైడర్‌పైకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన అజయ్‌కుమార్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. బస్సులో ఉన్న చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని వెనక వస్తున్న మరో బస్సులో గమ్యస్థానాలకు చేర్చారు. ప్రమాదం కారణంగా వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో క్రేన్ సహాయంతో బస్సును అక్కడి నుంచి తొలగించారు. బాధితుడు అజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ అవసరం

ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ నీరజాప్రభాకర్

ఏజీవర్సిటీ: విద్యార్థులకు చదువుతో పాటు పండ్ల తోటలు,కూరగాయల తోటలపై క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని అప్పుడే అనుకున్న ఫలితాలు సాధిస్తారని శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ నీరజా ప్రభాకర్ అన్నారు.రాజేంద్రనగర్‌లోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, పండ్ల పరిశోధన స్థానం సంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పండ్లు, కూరగాయల నర్సరీల స్థాపన మరియు నాణ్యమైన మొక్కల ఉత్పత్తికి చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అండర్ గ్రాడ్యుయెట్, గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో వీసీ పాల్గొన్నారు. ముఖ్యంగా మదర్‌బ్లాక్ (తల్లి మొక్కలు)ఏర్పాటు చేసుకునే విద్యార్థులకు క్షేత్రస్థాయిలో వివరించారు. గ్రాఫ్టింగ్(అంటుకట్టుట) విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరించారు. నర్సరీలను స్థాపించి ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలని సూచించారు.కార్యక్రమంలో వర్సిటీ డీన్ డాక్టర్ కిరణ్‌కుమార్, కళాశాల అసోసియేట్ డీన్ చీనా నాయక్, ఓఎస్‌ఏ డాక్టర్ సాయికృష్ణ, నిఖిల్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ

గంజాయి రవాణాదారుల అరెస్ట్

5.3 కేజీల గంజాయి స్వాధీనం

భాగ్యనగర్‌కాలనీ: కారులో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 5.3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. బుధవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ చంద్రశేఖర్ వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా, గోదావరిఖని గౌతమ్‌నగర్‌కు చెందిన మేకల అభిలాష్, మంథనికి చెందిన లింగం శ్రీపాద్, అడ్డగుట్టపల్లికి చెందిన చెల్లా ధను, కాచుపల్లికి చెందిన నిమ్మల మణికంఠ చిన్ననాటి స్నేహితులు. వీరు కూకట్‌పల్లి, వివేక్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. పుట్టిన రోజు వేడుకల నిమిత్తం భద్రాచలం వెళ్లిన వీరు అక్కడి నుంచి సీలేరు వెళ్లి గంజాయి కొనుగోలు చేసి నగరానికి తీసుకువచ్చారు. కూకట్‌పల్లి వై జంక్షన్ సమీపంలో వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు స్విఫ్ట్ డిజైర్ కారులో వస్తున్న వీరిని ఆపి కారును సోదా చేయగా డిక్కీలో 5.3 కేజీల గంజాయిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. కాగా నిందితుల్లో ఒకరైన అభిలాష్ గతంలో గంజాయి కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. ముగ్గురు స్నేహితులతో కలిసి గంజాయి విక్రయించి సొమ్ము చేసుకోవాలనే పథకం వేశాడు. ఈ క్రమంలోనే పోలీసులకు పట్టుబడ్డాడు. వారి నుంచి 5.3 కేజీల గంజాయి, స్విఫ్ట్ డిజైర్‌కారు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. అభిలాష్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయనున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో కూకట్‌పల్లి సీఐ నర్సింగ్‌రావు, డీఐ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలోని గొలుసు తస్కరణ

రాజేంద్రనగర్: స్కూల్‌కు వెళ్లిన పిల్లలను తీసుకురావడానికి వెళ్తున్న ఓ గృహిణి మెడలోని బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. శివరాంపల్లి ప్రాంతానికి చెందిన ప్రియాంక (32) తన పిల్లలను మధ్యాహ్నం ఇంటికి తీసుకువచ్చేందుకు స్కూల్‌కు వెళ్తుంది. స్కూల్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకుల్లో ఒకరు ప్రియాంక మెడలోని గొలుసును తెంచుకుని ఉడాయించారు. బలంగా గొలుసును తెంచడంతో మెడకు గాయమైంది. ఈ రహదారిపై అంతగా జన సంచారం లేకపోవడంతో చైన్‌స్నాచర్లు పారిపోయారు. స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల్లో నంబర్ ప్లేట్ లేని వాహనంపై ఇద్దరు ఈ దారి గుండావెళ్తున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి.

సమస్యలు పరిష్కరించండి

కేటీఆర్ ఓఎస్డీకి శివసాయి నగర్ కాలనీ వాసుల వినతి



సాక్షి, సిటీబ్యూరో: గత ఆరేళ్లుగా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని మంత్రి కేటీఆర్ ఓఎస్డీ మహేందర్‌రెడ్డికి బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బైరాగిగూడ శివసాయి నగర్ కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. కాలనీలో సీసీ రోడ్లు వేయించాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. వీటిపై మహేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించి.. ఈ సమస్యలు పరిష్కరించాల్సిందిగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించారు. ఓఎస్డీని కలిసినవారిలో శివసాయినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, కార్యదర్శి వెంకట్ పార్సి, సభ్యులు రమేశ్‌గౌడ్, వరుణ్‌చౌదరి ఉన్నారు.

లోకల్ మేడ్.. బ్రాండెడ్ నేమ్స్

చాక్లెట్ల పరిశ్రమపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

రాజేంద్రనగర్: బ్రాండెండ్ కంపెనీల పేరుతో చాక్లెట్లు, లాలిపప్స్, పిప్పర్‌మెంట్స్ తయారు చేస్తున్న ఓ పరిశ్రమపై రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం దాడి చేశారు. యజమానితో పాటు పనిచేస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.3 లక్షల రూపాయల విలువ చేసే ముడిసరుకు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... సులేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన అహ్మద్ రెండు సంవత్సరాలుగా ఎంకే స్వీట్స్ పేరిట చాక్లెట్లు, పిప్పర్‌మెట్స్, లాలీపప్స్ తయారు చేస్తున్నాడు. చిన్నపాటి పరిశ్రమగా కొనసాగిస్తూ వీటిని నగరవ్యాప్తంగా విక్రయిస్తున్నాడు. తన మ్యానిఫాక్చరింగ్ పేరు ఎక్కడ కనిపించకుండా వివిధ పేర్లతో అందమైన ప్యాకింగ్‌లు చేస్తూ బేగంబజార్‌లోని వ్యాపారులకు హోల్‌సేల్‌గా అమ్ముతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం ఉదయం పరిశ్రమపై దాడి చేసి యజమానితో పాటు కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 350 కిలోల చక్కర, 10 రసాయన బాటిళ్లు, 10 రంగు డబ్బాలు, ఒక డ్రమ్ము గ్లూకోజ్ లిక్విడ్, 10 కిలోల సిట్రిక్ యాసిడ్ పౌడర్, ఒక బాటిల్ ఆరెంజ్ లిక్విడ్ ఫ్లేవర్, 40 కిలోల బెస్ట్ పాలిష్ పౌడర్, ఒక మిక్సింగ్ మిషిన్, కిలో స్వీట్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితుడిని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు.



చాక్లెట్లు తయారు చేస్తున్న కార్మికులు

రెండు సంవత్సరాలుగా దందా..

అహ్మద్ రెండు సంవత్సరాలుగా వీటిని తయారు చేస్తున్నాడు. అయితే జీహెచ్‌ఎంసీ, ఫుడ్‌సేఫ్టీ కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఈ దందా కొనసాగిస్తున్నాడు. జీహెచ్‌ఎంసీ నుంచి కేవలం ట్రేడ్ లైసెన్స్ మాత్రం తీసుకున్నాడు. దీని గడువు కూడా గత నెలలో ముగిసింది. ఇంకా రెన్యూవల్ చేయలేదు.

పరిసరాలు అపరిశుభ్రంగా..

అహ్మద్ నిర్వహిస్తున్న ఈ పరిశ్రమ పరిసరాలు పూర్తిగా అపరిశుభ్రంగా ఉన్నాయి. చాక్లెట్ల కోసం తయారు చేసే పానకంలో ఈగలు, దోమలు, పురుగులు ఉన్నాయి. అందులోనే కార్మికులకు మూత్రశాల ఏర్పాటు చేశారు. దుర్గంధభరితంగా ఉన్న దీనిని చూసి పోలీసులు సైతం అవాక్కయ్యారు.

◆ పరిశ్రమలో పనిచేసే వారిని బిహార్, అస్సాం రాష్ట్రాల నుంచి ఆరు నెలల కాంట్రాక్టుపై తీసుకొస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

◆ చాక్లెట్ పరిశ్రమ బయట నుంచి కట్టెల గోదాంగా కనిపిస్తుంది. ముందువరసలో కట్టెలు ఉండగా, కొంచెం లోపలకు వెళితే పరిశ్రమ కనిపిస్తుంది.

◆ చాక్లెట్లు తయారు చేసేందుకు పూర్తిగా యంత్రాలను వినియోగిస్తున్నాడు. వివిధ ఆకృతుల్లో వచ్చేందుకు ప్రత్యేకంగా వివిధ రాష్ట్రాల నుంచి డయల్స్‌ను తయారు చేయించి తీసుకొచ్చాడు.

◆ వీటి తయారీలో పూర్తిగా రసాయనాలనే వినియోగిస్తున్నారు. కాగా లాలిపప్స్‌లో 18 రకాలు తయారు చేయిస్తున్నాడు.

నార్సింగిలో అధునాతన పశువుల మార్కెట్

- రూ.4కోట్లతో పనులు
- గేదెలతో పాటు మేకలు, గొర్రెల అమ్మకాలు
- 9షెడ్లు, 40 షాపుల నిర్మాణం

మణికొండ: హైదరాబాద్ శివార్లలో పశువుల మార్కెట్ అనగానే గుర్తుకు వచ్చే నార్సింగి మార్కెట్‌ను అధునాతనంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటి వరకు గేదెలు, ఆవుల విక్రయాలకే పెద్ద పీట వేయగా రాబోయే రోజుల్లో మేకలు, గొర్రెల అమ్మకాలకు కేంద్రం కానుంది. అందుకు మున్సిపాలిటీ నుంచి రూ. 4కోట్లతో అధునాతన పశువుల మార్కెట్ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో మార్కెట్ కమిటీకి 25 ఎకరాల వరకు భూమి ఉండగా అది కబ్జాలకు పోను 15 ఎకరాల వరకు ఉంది. అందులో ఇప్పటికే రెండు ఎకరాలలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులను ప్రారంభించారు. మిగతా భూమిలో అధునాతన మార్కెట్‌ను నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. 9 షెడ్లు, 40షాపులను నిర్మించేలా ప్రణాళికను సిద్ధం చేశారు. బుధవారం నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి. వెంకటేశ్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చైర్మన్‌లు ఎం. ప్రవీణ్‌యాదవ్, జి.వెంకటేశ్‌యాదవ్‌లు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, ఉషారాణి, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.



నార్సింగిలో పశువుల మార్కెట్ పనులను ప్రారంభించిన చైర్మన్‌లు

వినియోగదారుల మండలి అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌గౌడ్

బండ్లగూడ: రంగారెడ్డి జిల్లా గండిపేట మండల హైదర్షాకోట్‌కి చెందిన బీసీ సంఘం నాయకుడు తెలంగాణ వినియోగదారుల మండలి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా వి.చంద్రశేఖర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సీతరాజ్‌కుమార్ చేతుల మీదుగా బుధవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల కోసం పని చేస్తానని తనకు అవకాశం ఇచ్చిన వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సీతరాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

అభివృద్ధి పథంలో శంషాబాద్ మున్సిపాలిటీ

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్
- రూ.11.50 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో 11.50 కోట్లతో చేపట్టనున్న సీసీ, బీటీ రోడ్లు, సివరేజ్ డ్రైయిన్‌లు పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా ఇరవై కోట్ల నిధులు రావడంతో పాటు పట్టణ ప్రగతి కింద మరో ఇరవై కోట్ల నిధులు రానున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, సీనియర్ నాయకులు ఆర్. గణేష్ గుప్తా, కౌన్సిలర్లు పి. సంజయ్‌యాదవ్, జహంగీర్‌ఖాన్, అజయ్, శ్రీకాంత్‌యాదవ్, భారతమ్మ, ముస్తఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ భవన్‌కు..

పట్టణంలోని ముదిరాజ్ భవన్ అభివృద్ధికి ఎమ్మెల్యే నిధుల కింద రూ. 50 లక్షలు కేటాయించడంతో స్థానిక కౌన్సిలర్ మేకల వెంకటేష్‌ముదిరాజ్‌తో పాటు ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు మల్లేష్ ముదిరాజ్ ఎమ్మెల్యేను సన్మానించారు.